www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 24 అక్టోబర్ 2025 | 5 | ఏలూరు

సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములను ఇచ్చి పునరావాస కాలనీల్లోకి వచ్చిన నిర్వాసితుల భూవివాదాలను పరిష్కరించాలని పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొరుటూరు, టేకూరు, గాజులగొంది నిర్వాసితులతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసి పునరావాస కాలనీల్లో ఉంటున్న నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో వివాదాలు సృష్టించడం సమంజసం కాదన్నారు. తెనంతరం తహశీల్దార్ కార్యాలయంలోను, పోలీస్ స్టేషన్లోనూ వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కొరుటూరు సర్పంచి గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచి కోర్స వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, పెంటమ్మ, కసికే రాజు, రాంబాబు, సాంబ, సోమరాజు, కామరాజు పాల్గొన్నారు.

చదరంగమా.. రణరంగమా..!

కూటమిలో కలకలం రేపిన డిఎస్‌పి అంశం

ఆధిపత్య పోరులో భాగమేనంటున్న పరిశీలకులు

డిఎస్‌పి చర్యలుండేనా అంటూ సర్వత్రా చర్చ

భీమవరం డిఎస్‌పి జైసూర్య తీరుపై డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ స్వయంగా జోక్యం చేసుకుని ఎస్‌పితో మాట్లాడటం, విచారణకు ఆదేశించడం ఒకింత చర్చనీయాంశమవ్వగా, ఆ డిఎస్‌పికి మద్దతుగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు కూటమిలో కలకలం సృష్టిస్తున్నాయి. దీనిపై సిఎం చంద్రబాబు ఎలా స్పందిస్తారు, డిఎస్‌పిపై అసలు చర్యలుండేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఏదేమైనా జిల్లా కేంద్రమైన భీమవరంపై ఆధిపత్యం కోసం కూటమిలోని టిడిపి, జనసేన మధ్య అంతర్లీనంగా సాగుతున్న పోరులో భాగమే డిఎస్‌పి అంశం అని పలువురు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

భీమవరం డిఎస్‌పి జైసూర్య పేకాట క్లబ్‌లకు మద్దతిస్తూ, సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్నారనేది జనసేనాని ప్రధాన ఆరోపణ. దీనిపై కూటమి నేతలే తనకు ఫిర్యాదు చేశారని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నేరుగా ఆ జిల్లా ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడటం, విచారించాలని సూచించడం చర్చనీయాంశమైంది. దీనిపై డిజిపి, హోంమంత్రి కూడా స్పందించడం, సిఎం చంద్రబాబు ఆరా తీయడంతో విచారణకు రంగం సిద్ధమైంది. ప్రధానంగా భీమవరం నియోజకవర్గంలో గతంలో పేకాట క్లబ్‌లు పెద్దఎత్తున సాగేవని, మామూళ్ల విషయంలో వచ్చిన తేడాల రీత్యా కొన్నాళ్ల క్రితం ఆ క్లబ్‌లపై పోలీసులు ఉక్కుపాదం మోపారనేది పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. తర్వాత మామూళ్లు సమర్పించుకుంటున్న కొన్ని క్లబ్‌ల జోలికి వెళ్లకుండా, ఇవ్వని క్లబ్‌లను కట్టడి చేయడం, అవీ వేర్వేరు ఆధిపత్య సామాజిక తరగతుల వారికి చెందినవి కావడంతో వివాదాస్పదమైనట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పక్క నియోజకవర్గంలో కూడా పేకాట శిబిరాలు పెద్దఎత్తున వాటివైపు కన్నెత్తి చూడకపోవడం జనసేన నేతల ఆగ్రహానికి కారణమైంది. ప్రధానంగా పిఎసి ఛైర్మన్, భీమవరం ఎంఎల్ఎ పి.అంజిబాబుకు క్యాబినెట్ ర్యాంకు హోదా ఉన్నా, అధికార టిడిపికి చెందిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకే అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయం అక్కడి జనసేన నేతల్లో బలంగా ఉంది. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టరేట్ భవనాల అంశం కూడా రెండు పక్షాల మధ్య దూరం పెంచిందనే చెప్పొచ్చు. దీనికితోడు ఉండి ఎఎంసి ఛైర్మన్ పదవి తొలుత జనసేన నేతకు ప్రకటించినా, దాన్ని అడ్డుకుని టిడిపి నేతకు కట్టబెట్టడం కలకలం సృష్టించింది. ఈ అంశాలన్నింటి నేపథ్యంలోనే జనసేన నేతలకు ఇబ్బందికరంగా తయారైన డిఎస్‌పిపై తమ అధినేతకు తెలియజేసినట్లు సమాచారం. డిప్యూటీ సిఎం తనతో మాట్లాడినట్లు, డిఎస్‌పిపై విచారణ నివేదిక ప్రభుత్వానికి పంపుతామని ఎస్‌పి సైతం ప్రకటించారు.

అయితే అదే సమయంలో విశాఖపట్నంలో డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు భీమవరం డిఎస్‌పికి మంచి ట్రాక్ రికార్డు ఉందనడం, తమ ప్రాంతంలో పేకాట సహజమని వ్యాఖ్యానించడం కలకలం రేపింది. స్వయంగా డిప్యూటీ సిఎం జోక్యం చేసుకున్న అంశంపై విచారణ జరుగుతుండగానే ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఎస్‌పికి మద్దతుగా టిడిపి నుంచి ఎన్నికైన డిప్యూటీ స్పీకర్ మాట్లాడటం అంటే తమ అధినేతను అవమానించినట్లేనని జనసేన శ్రేణులు భగ్గుమంటున్నాయి. ఒకవేళ డిఎస్‌పి మంచోడైతే నేరుగా పవన్ కళ్యాణ్‌కు చెప్పకుండా మీడియా ముందు చెప్పడం అంటే టిడిపి అధిష్టానమే వ్యూహాత్మకంగా ఇలా మాట్లాడించిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తూ రఘురామ ఆ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో పక్కనే టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉండటం దీనికి కారణమైందని తెలుస్తోంది. ఏదేమైనా రఘురామ తీరు నాడు వైసిపిని ఇబ్బంది పెడితే, ప్రస్తుతం టిడిపికి తలనొప్పులు తెచ్చిపెడుతుందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు డిఎస్‌పిపై చర్యలుండేనా, లేక టీ కప్పులో తుపానులా వివాదాన్ని చంద్రబాబు చల్లబరుస్తారా అనేది వేచిచూడాలి. ఈ రాజకీయ చదరంగంలో డిఎస్‌పిపై చర్యలు తీసుకుంటే కచ్చితంగా జనసేనానిదే పైచేయి అయినట్లవుతుందని, లేనిపక్షంలో రఘురామ వ్యాఖ్యలకు అనుగుణంగా డిఎస్‌పి తప్పులేదని నిర్ధారిస్తే జనసేన శ్రేణులు రగిలిపోయే అవకాశం ఉందని పరిశీలకుల అభిప్రాయం. ఏదేమైనా డిఎస్‌పి వ్యవహారంతో సరిపెట్టకుండా ఇతర అంశాలపైనా చంద్రబాబు దృష్టి పెడితే ఇక్కడ ఆధిపత్య పోరు తగ్గే అవకాశం ఉందని, లేనిపక్షంలో ఇది రానున్న కాలంలో తీవ్రరూపం దాల్చి రణరంగమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇరిగేషన్ చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - ఏలూరు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

జిల్లాలో రూ.258 కోట్లతో మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణం (ఆర్ఆర్ఆర్) పనులకు సంబంధించి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం మైనర్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణం పనులు, భూగర్భజలాల పెంపు తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1513 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉండగా, వాటిలో మొదటి దశలో 175 చెరువులకు మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు రూపొందించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించామన్నారు. రెండో దశలో రూ.258 కోట్లతో 350 మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఆర్ఆర్ఆర్ పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి తుది ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మిగిలిన మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి మరమ్మతులు, పునరుద్ధరణ, పునర్నిర్మాణం పనుల ప్రతిపాదనలపై రూపొందించాల్సిన ప్రతిపాదనలపై ప్రతివారం లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. 200 చిన్న తరహా సాగు, తాగునీటి చెరువుల ఫిల్లింగ్‌నకు సంబంధించి ప్రతిపాదనలను కూడా ప్రభుత్వానికి సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలని డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఇ దేవప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ త్రినాథరావు, డ్వామా పీడీ సుబ్బారావు, భూగర్భజల శాఖ డిడి పి.కోదండరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కు కీలక పదవి

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర శాసనసభ షెడ్యూల్ కులాల సంఘం కమిటీ సభ్యులుగా చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ నియమితులయ్యారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ఎంఎల్ఎ రోషన్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపి, హర్షం వ్యక్తం చేశారు.

ఎరువుల భారం రైతులపై వేయొద్దు

జిఎస్‌టి తగ్గింపు ప్రయోజనం రైతులకే చెందాలి: ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ కొనసాగించేందుకు నిరాకరించడంతో ఎరువుల కంపెనీలు ఆ మేరకు ధరలు పెంచి రైతులపై భారం వేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాయని, ఈ పరిణామంతో కాంప్లెక్స్ ఎరువులు 50 కిలోల బస్తాపై రూ.50 నుండి రూ.100 వరకు ధరల భారం రైతులపై పడనుందని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎరువుల ధరలు-రైతులపై భారం అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించామని అన్ని రకాల సరుకుల వినియోగదారులు పండుగ చేసుకోవాలని, దేశమంతా ప్రచారం చేస్తుందని తెలిపారు. ఎరువులపై ఉన్న 18 శాతం జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించామని ప్రభుత్వం గొప్పగా ప్రకటించిందన్నారు. అయితే జిఎస్‌టి పన్ను రాయితీ రైతులకు కాకుండా ఎరువుల కంపెనీలకు ప్రయోజనకరంగా మారుతుందని చెప్పారు. జిఎస్‌టి పన్ను రాయితీల ప్రయోజనం రైతులకు దక్కేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల ఉపాధ్యక్షులు బోడిక రామచంద్రరావు పాల్గొన్నారు.

ముంచుతున్న ముసురు

జోరు వర్షంతో స్తంభించిన జనజీవనం

పల్లపు ప్రాంతాలు జలమయం

పిడుగులు పడి పలుచోట్ల సామగ్రి ధ్వంసం

ముదినేపల్లి: వర్షపు నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఉదయం నుంచి జల్లులు ప్రారంభమై మధ్యాహ్నానికి భారీ వర్షంగా మారడంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఏలూరులోని అమీనాపేట పోలీస్ స్కూల్ రోడ్, ఆర్ఆర్‌పేట, పవర్‌పేట రోడ్డు, వన్‌టౌన్ విజయలక్ష్మి థియేటర్ రోడ్ ఇలా పలు ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు గురయ్యారు. ఉదయం నుంచి వర్షం ఆగకుండా కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కూరగాయల మార్కెట్ వెలవెలబోయింది. చిరువ్యాపారులు వ్యాపారాలు లేక లబోదిబోమంటున్నారు. అదేవిధంగా అమీనాపేట పోలీస్ స్కూల్ వద్ద గల ప్రధాన రహదారులు కొద్దిపాటి వర్షానికే నీరు నిలిచిపోతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నీరు రోడ్డుపై నిలిచిపోతుందని వాపోయారు. కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని, డ్రెయినేజీ వ్యవస్థను సరి చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే దారిలో ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు, కళాశాలకు నడిచి వెళ్తున్నారని, వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో వాహనాలు జారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను బాగుజేయాలి

జె.ప్రసాద్, స్థానికుడు

కొద్దిపాటి వర్షం కురిస్తేనే రోడ్డుపై నీళ్లు నిలిచి నాలుగైదు రోజులు అలాగే ఉంటున్నాయి. నీరు పోవడానికి డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో నీరు పోవట్లేదు. ఇదే దారిలో ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు, కళాశాలకు నడిచి వెళ్తున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థను బాగుజేయాలి.

పెంకుటిల్లు ధ్వంసం

కొయ్యలగూడెం: మండలంలో పొంగుటూరు పంచాయతీ పరిధిలోని కన్నాయగూడెం గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కోడె రాంబాబు పెంకుటిల్లు ముందుభాగం కూలిపోయింది. భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని బాధితుడు తెలిపారు. కూలిన పెంకుటిల్లును విఆర్ఒ రమేష్ పరిశీలించారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

కుక్కునూరు: గురువారం మధ్యాహ్నం నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. మండలంలోని అన్ని గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమై, డ్రెయినేజీలు పొంగి నీరు రోడ్లపైకి చేరడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలు నీట మునిగి, సంజయ్‌నగర్, సిఎం కాలనీ, రైస్‌మిల్లు కాలనీ, జిసిసి కాలనీ, గాంధీనగర్ కాలనీ, సినిమా హాల్, రామాలయం సెంటర్, కిష్టారం కమ్మరగూడెం వంటి పలు కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో నివాసితులు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు నానావస్థలు పడ్డారు. వర్షం కారణంగా కొనుగోలుదారులు లేక దుకాణాలు వెలవెలబోగా, ఉరుములతో మండలం దద్దరిల్లింది.

ముసునూరు: మండలంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. అధిక వర్షంతో డ్రెయినేజీలు పొంగి రోడ్లపైకి భారీగా నీరు చేరింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెక్కపల్లి, గొల్లపూడి, లోపూడి, వలసపల్లి, అత్తవారిగూడెం గ్రామాల్లో పలు కాలనీలు నీట మునిగి నివాసాల చుట్టూ నీరు చేరింది. దీంతో ఆయా కాలనీల ప్రజలు ఇంటి నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. పత్తి, వరి, మినుము, పెసర పప్పు ధాన్యాల పంటలు దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలిదిండి: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో రోడ్లన్నీ కాలువలను తలపించాయి. గ్రామాల్లో డ్రెయినేజీ నీరు రోడ్లపైకి చేరింది. స్థానిక ఈద్గా సమీపంలోని ఇళ్లలోకి, పడమటిపాలెం బంకు కాలనీ ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ఆయా కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. స్థానిక గ్రంథాలయం చుట్టూ నీరు నిలిచిపోవడంతో నీటిని తోడి బయటకు పోస్తున్నారు. ఉప్పుటేరు పోటు తగ్గడంతో ప్రధాన మురుగు కాలువల్లో నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఆక్వా రైతులు చేప, రొయ్యలను కాపాడుకునేందుకు చెరువుల వద్దే పడిగాపులు పడుతున్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలాన్ని శుక్రవారం వాన కుమ్మేసింది. తీవ్ర అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా వర్షాలతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం 9 గంటలకు మొదలైన వర్షం ఎడతెరిపి లేకుండా సాయంత్రం వరకు కురిసింది. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. జనం ఇంటి నుండి కాలు బయట పెట్టే పరిస్థితి లేదు. ఎడతెరిపిలేని వర్షంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. జోరు వర్షంతో ముదినేపల్లి పశ్చిమ పాఠశాల, కొత్తపల్లి, చేవూరుపాలెం, వడాలి-2 ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లోకి భారీగా నీరు చేరింది. దీంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. ముదినేపల్లి పశ్చిమ పాఠశాలలో తల్లిదండ్రులు పిల్లలని ఎత్తుకుని పాఠశాలలో దింపిన పరిస్థితి ఉంది. మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రెయినేజీలు పొంగడంతో నీరంతా రోడ్లపైకి చేరింది. భారీ వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, ఆర్అండ్‌బి రహదారులు కాలువలను తలపించాయి. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, విద్యార్థులు నానావస్థలు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో గృహోపకరణాలు తడిసిపోయాయి. వర్షంతో ముదినేపల్లి సెంటర్ చిత్తడి చిత్తడిగా మారింది. రోడ్లపై గోతుల్లో నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు విద్యాసంస్థలన్నీ గురజ రోడ్డులోనే ఉండటం, ఈ రోడ్డు జలమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు విద్యార్థులతో పాటు జనం కూడా ఇబ్బందులు పడ్డారు. వర్షానికి జనం బయటకి రాకపోవడంతో బేరాలు లేక దుకాణాలు వెలవెలబోయాయి. మండలంలోని ప్రధాన డ్రెయిన్లన్నీ పొంగి పరవళ్లు తొక్కుతున్నాయి.

కొయ్యలగూడెం: పిడుగుపాటుకు దెబ్బతిన్న పెంకుటిల్లు



దగ్ధమైన మీటర్, ఫ్యూజ్‌బాక్స్

పిడుగుపాటుకు విద్యుత్ సామగ్రి ధ్వంసం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పిడుగు పడి రెండు విద్యుత్ మీటర్లు కాలిపోయిన ఘటన గురువారం మండలంలోని అల్లూరు గ్రామంలో జరిగింది. మండలంలో కురిసిన భారీ వర్షానికి అల్లూరు గ్రామంలో పిడుగు పడింది. గ్రామానికి చెందిన చెందిన తలారి చంద్రశేఖర్, బోయిన వీరరాఘవులు ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పిడుగు కొబ్బరి చెట్టుపై పడి ఇంటి శ్లాబ్‌కు తగలడంతో రెండు కరెంట్ మీటర్లు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రెండు గృహాల్లో సామగ్రి, ఫ్యాన్లు ధ్వంసమయ్యాయి. విఆర్ఒ శ్రీరాములు తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. మండలంలో వడాలి గ్రామంలో వర్షానికి కోలా శ్రీనివాసరావుకు చెందిన ఇంటిలోని మధ్య గోడ కూలి అద్దెకు ఉంటున్న తుమ్మెట వెంకటేశ్వరరావు భార్య గాయపడింది.



ఏలూరులో రోడ్డుపైకి చేరిన వర్షపు నీరు

ముసునూరు: రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

సందీప్ హాస్పటల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ చంటి, మేయర్ నూర్జహాన్

నగరంలోని ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి దేవస్థానం రోడ్డులో నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.సందీప్ హాస్పిటల్ జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ (లేజర్ సెంటర్)ను ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ, నగర మేయర్ నూర్జహాన్ గురువారం ప్రారంభించారు. తొలుత హాస్పిటల్ అధినేత డాక్టర్ బి.సందీప్, ఆయన సతీమణి డాక్టర్ సుష్మ దంపతులు అతిథులను ఆహ్వానించారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరులో వైద్య రంగం అభివృద్ధి దిశగా సాగుతుండటం అభినందనీయమన్నారు. కొత్తగా ప్రారంభమైన ఈ హాస్పిటల్‌లో లాప్రోస్కోపిక్, లేజర్ శస్త్రచికిత్సలతో సహా ఆధునిక వైద్య పరికరాల అందుబాటులో ఉండటం విశేషమన్నారు. సాధారణ ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలందిస్తుందని నమ్ముతున్నామన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సేవలకు ప్రయివేట్ రంగం తోడ్పాటునివ్వడం శుభ సూచకమన్నారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ హాస్పిటల్‌లో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, ఐసియు, లేజర్ యూనిట్, 24 గంటల ఎమర్జెన్సీ, ల్యాబ్, ఫార్మశీ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోగుల సౌకర్యం కోసం నిపుణుల వైద్య బృందం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఆర్‌టిసి విజయవాడ రీజినల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామారావు, 37వ డివిజన్ కార్పొరేటర్ పృథ్వీ, శారద సోము, మన్నా చర్చి పాస్టర్ ఎం.ఏలీషారాజు, జ్యోతిరాజు, ప్రజాప్రతినిధులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెస్ట్ ఫీల్డ్ స్కూల్ బస్సు బోల్తా

ముగ్గురు విద్యార్థులకు గాయాలు - డ్రైవర్ మద్యం తాగి నడపడమే కారణం

ప్రజాశక్తి- ఉండి

పంట పొలాల్లో బోల్తా కొట్టిన స్కూల్ బస్సును క్రేన్‌తో తీస్తున్న వైనం

మద్యం తాగి డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో పంటపొలాల్లోకి స్కూల్ బస్సు బోల్తా పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఉండి, భీమవరం రహదారిలోని నరసింహపురం వద్ద ఉన్న వెస్ట్ ఫీల్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సు డ్రైవర్ రేవు నాగేంద్రబాబు ఉదయమే మద్యం సేవించి ఉండి మండలం అర్తమూరు గ్రామంలో ఆరుగురు విద్యార్థులను బస్సులోకి ఎక్కించుకుని బయలుదేరాడు. పెదపుల్లేరు శివారు మేడవరంలో మిగిలిన విద్యార్థుల కోసం వెళ్తుండగా మార్గమధ్యలోని పెదపుల్లేరు శివారు మలుపు వద్దకొచ్చేసరికి అప్పటికే మత్తులో ఉన్న డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో పంట పొలాల్లోకి బస్సు బోల్తా పడింది. వెంటనే స్పందించిన స్థానికులు బస్సులో ఉన్న ఆరుగురు విద్యార్థులను హుటాహుటీన బయటకు తీసి భీమవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మద్యం తాగి బస్సు నడపడం ఏంటని స్థానికులు డ్రైవర్‌ను ప్రశ్నించగా నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో స్థానికులు నాగేంద్రబాబుకు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో బయటకు తీశారు. అయితే వెస్ట్ ఫీల్డ్ స్కూల్ బస్సు డ్రైవర్లు ఇటీవల కాలంలో నిర్లక్ష్యంగా నడుపుతున్నారని పలువురు తెలిపారు. ఆసుపత్రికి తరలించిన వారిలో అర్ధమూరు గ్రామానికి చెందిన కైలే హర్షవర్ధన్ (ఆరో తరగతి) భుజం వద్ద, చేయి విరిగింది. మరో ఇద్దరు చిన్నారులు తేజశ్రీ, సోనాలికకు గాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురు చిన్నారులు సురక్షితంగా ఉన్నారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా డ్రైవర్ నాగేంద్రబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలి : ఎస్ఎఫ్ఐ

భీమవరం : మేడపాడు వద్ద వెస్ట్ ఫీల్డ్ స్కూల్ బస్సు ప్రమాదానికి గురికావడానికి కారణం బస్సు డ్రైవర్ మద్యం సేవించడమేనని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.లక్ష్మణ్ విమర్శించారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భీమవరం అక్షర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులను లక్ష్మణ్ పరామర్శించి వారి తల్లిదండ్రులతో జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ గతంలో అనేకసార్లు రవాణా శాఖ అధికారులకు ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో బస్సులు నాణ్యతలేవని, డ్రైవర్లు పూర్తిస్థాయి శిక్షణ కలిగి ఉండట్లేదని తెలియజేసినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా రవాణాశాఖ అధికారులు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాన్లు, బస్సులు, ఆటోలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు పునరుద్ధరించాలి

సిపిఎం నగర కార్యదర్శి పంపన రవికుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు వెంటనే పునరుద్ధరించాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నగర కార్యదర్శి పంపన రవికుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించనందున ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు కొన్ని రోజులుగా నిలిచిపోవడంతో రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని, రోగుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు, ఆందోళనతో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు కొంతమంది వైద్యం కోసం వెళుతున్నప్పటికీ సరైన సౌకర్యాలు లేక, ప్రైవేటు వైద్యం చేయించుకోలేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. డాక్టర్లు, సౌకర్యాలు లేకపోవడంతో ప్రభుత్వాసుపత్రిలో వైద్యం సరిగా అందడం లేదన్నారు.బడా కార్పొరేట్లకు పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ప్రకటిస్తున్న కూటమి ప్రభుత్వం పేద ప్రజల వైద్యం కోసం అవసరమైన నిధులు విడుదల చేయకపోవడం బాధ్యతారాహిత్యమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించి ఆసుపత్రుల యాజమాన్యంతో చర్చించి పేదలకు వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగేటట్లు చూడాలన్నారు. వేలాదిమంది ప్రాణాలు కాపాడాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుర్తించాలన్నారు.

వసతి గృహంలో ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో గురువారం శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచిత వైద్యాన్ని అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డాక్టర్లు పలు సూచనలు చేశారు. దంతాలను ఎలా పరిశుభ్రం చేసుకోవాలో డెమో ప్రదర్శన ద్వారా చూపించారు. దంత సంరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. దంతాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే జరిగే నష్టాలను వివరించారు. కనీసం ఆరు నెలలకోసారి దంత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పొగ తాగడం వల్ల జరిగే నష్టాలను వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలులందరికీ మొబైల్ దంతవైద్య వాహనంలో వైద్యం అందించారు. సెయింట్ జోసెఫ్ సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మోజెస్, ఎడ్మినిస్ట్రేటర్ ఫెలిక్స్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు ఎంతగానో ప్రోత్సాహించి వారిని అభినందించారు. ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ శ్రీవల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజా దంత వైద్య విభాగ హెచ్‌ఒడి డాక్టర్ ఎం.పావన సంధ్య, డాక్టర్ టి.ప్రశాంత్, డాక్టర్ జి.ఉదయలక్ష్మి, ప్రజాదంత వైద్య విభాగ హౌస్ సర్జన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

చెకుముకి టాలెంట్ టెస్ట్‌తో విద్యానైపుణ్యం పెంపుదల

ప్రజాశక్తి - టి.నరసాపురం

చెకుముకి టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందుతాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రచార కార్యదర్శి పురం శ్రీనివాస్ అన్నారు. విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రతి ఏడాది నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను పాఠశాల స్థాయిలో గురువారం 600 మంది 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లోని విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాశారని, పాఠశాల స్థాయిలో మొదటి స్థానం సాధించిన వారికి మండల స్థాయిలో నవంబర్ 1న టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పరీక్ష నిర్వహిస్తామని, మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి నవంబర్ 23న జిల్లా స్థాయి పరీక్ష ఉంటుందని, జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

ప్రజా సమస్యలు పట్టించుకోని అధికారులు

మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు బేతపూడి వెంకటరమణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే సంబంధిత శాఖల అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదంటూ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు, కాకరవాడ మాజీ సర్పంచి బేతపూడి వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ప్రజలు రోగాలతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వస్తుంటే డాక్టర్లు అందుబాటులో ఉండడంలేదన్నారు. వైద్యం కోసం దేవరంవాసులు ముదినేపల్లి పిహెచ్‌సికి వస్తే ఇక్కడ సిబ్బంది గురజ, దేవపూడి పిహెచ్‌సిలకు వెళ్లమంటున్నారన్నారు. దేవరం గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందన్నారు. ఇటీవల కోతులు ముగ్గురు మహిళలపై దాడి చేయటంతో గాయపడినట్లు తెలిపారు. చికిత్స కోసం ముదినేపల్లి పిహెచ్‌సికి వస్తే డాక్టర్లు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియదన్నారు. అన్ని గ్రామాల్లో డ్రెయినేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, భారీ వర్షాలకు మురుగు నీరంతా రోడ్లపై, నివాసాలు చుట్టూ చేరడంతో ప్రజలకు రోగాలు వచ్చి ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నారన్నారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ పంచాయతీలు గాలికి వదిలేశాయన్నారు. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు చీకట్లో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, పంచాయతీలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని కోరారు.

రూ.1.50 కోట్లతో లింగయ్య చెరువు అభివృద్ధి

గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ఉన్న ద్వారకాతిరుమలలో రూ.1.50 కోట్ల అంచనాలతో ఆధ్యాత్మిక పార్కు అభివృద్ధికి గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు సంకల్పించారు. ద్వారకాతిరుమల ప్రముఖ పుణ్యక్షేత్రానికి అనేక ప్రాంతాల నుంచి యాత్రికులు వస్తుంటారని, వారికి ఆధ్యాత్మికతతో స్వాగతం పలకాలని చెప్పారు. స్థానిక లింగయ్య చెరువును ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను అంచనాలు తయారు చేయాలని, తహశీల్దార్ వెంటనే చెరువు సరిహద్దులు నిర్ధారించి ఆక్రమణలు తొలగించాలని ఆయన ఆదేశించారు. ద్వారకాతిరుమల ప్రధాన కూడలి, ఆలయ సెంటర్‌లో ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి ద్వారకాతిరుమల మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ, స్థానిక సర్పంచి కుంటం స్వర్ణలత, జెడ్‌పిటిసి సభ్యులు శామ్యూల్, సీనియర్ నాయకులు పాకలపాటి గాంధీ, రామన్నగూడెం సొసైటీ ఛైర్మన్ బొబ్బ రాము, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్‌కుమార్, ఐటిడిపి మండలాధ్యక్షులు ఏపూరి కిషోర్, తెలుగు రైతు మండలాధ్యక్షులు పాకలపాటి మాణిక్యాలరావు, తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎస్ఐ సుధీర్, ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు, రాజేంద్ర, డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాస్, స్థానిక పంచాయతీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ఎంఇఒకు, హెచ్‌ఎంలకు సబ్ కలెక్టర్ వినూత్న ఆదేశం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం అమలు చేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న చెప్పారు. నూజివీడు డివిజన్ స్థాయిలో మండల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సమావేశం ఉప విద్యాశాఖాధికారి పి.సుధాకర్ అధ్యక్షతన గురువారం నూజివీడు డివైఇఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న పాల్గొని మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం పథకం మెనూ ప్రకారం అమలు చేయాలని, టాయిలెట్స్ అన్ని పరిశుభ్రంగా ఉండాలని, పదో తరగతిలో విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులందరికీ ఆపార్ ఐడి క్రియేట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, పదో తరగతి విద్యార్థులందరూ ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, అందుకు ప్రధానోపాధ్యాయులు, టీచర్లు కష్టపడి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఆశ, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు రవీంద్ర, ఎండి ఎం కోఆర్డినేటర్, మండల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

'గుడ్ సమరిటన్స్ ఆఫ్ నుజివీడు' ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నుజివీడు సబ్ కలెక్టర్ వినూత్న ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో గుడ్ సమారిటన్స్ ఆఫ్ నుజివీడు అనే సమాజ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి పౌరులు నుజివీడు అభివృద్ధి, పరిశుభ్రత, ఆరోగ్యం, సాంస్కృతిక, మహిళా శ్రేయస్సు కోసం తన వంతు సహకారం అందించవచ్చని చెప్పారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా ఈ కమ్యూనిటీకి చేరి, మీ సూచనలు, చిత్రాలు, అభిప్రాయాలను పంచుకోవచ్చని తెలిపారు. ఈ కమ్యూనిటీని నాలుగు విభాగాలుగా విభజించారు. క్లీన్ అండ్ బ్యూటిఫుల్ నుజివీడు విభాగంలో పట్టణ పరిశుభ్రత, అందమైన వాతావరణం, శుభ్రత కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, సూచనలు పంచుకోవచ్చు. హెల్దీ అండ్ హ్యాపీ నుజివీడు విభాగంలో ఆరోగ్యం, ఆసుపత్రులు, వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన అంశాలు పంచుకోవచ్చు. కల్చరల్లి రిచ్ నుజివీడు విభాగంలో నుజివీడు సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ అభివృద్ధి చేసే సూచనలు, సాంస్కృతిక కార్యక్రమాల ఫొటోలు పంచుకోవచ్చు. స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ నుజివీడు విభాగంలో మహిళా శ్రేయస్సు, సాధికారత, భద్రత, విజయ కథలపై సమాచారం లేదా చిత్రాలు పంచుకోవచ్చు. అందరం కలిసి శుభ్రమైన, ఆరోగ్యవంతమైన, సాంస్కృతికంగా సంపన్నమైన మహిళా సాధికారతతో కూడిన నుజివీడును నిర్మిద్దామని సబ్ కలెక్టర్ వినూత్న చెప్పారు.

మద్యం షాపుల వద్ద ఎక్సైజ్ సురక్ష క్యూఆర్ కోడ్

ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల వద్ద గురువారం ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ క్యూఆర్ కోడ్ పోస్టర్లు అంటించారు. ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య మాట్లాడుతూ సురక్ష క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా మద్యం నాణ్యత వినియోగదారులు తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిమద్యం షాపు వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్ ఉంచాలన్నారు. వినియోగదారులు సురక్ష యాప్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని ప్రతి మద్యం బాటిల్ కొనుగోలు సమయంలో స్కాన్ చేయడం ద్వారా మద్యం నాణ్యత వివరాలు తెలుస్తాయన్నారు. తరచుగా మద్యం దుకాణాలను తనిఖీ చేస్తూ, నాణ్యతా ప్రమాణాలపై పలు సూచనలు చేస్తున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్ పోస్టర్ ప్రదర్శనలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎస్ఐలు గణపతి, ప్రసాద్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విధానంలో అక్రమాల్లేకుండా చర్యలు

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

దెందులూరు : తమ అవినీతి, అక్రమాలను ఎదుటి వారిపై నెట్టడంలో జగన్ అండ్ కో పిహెచ్‌డి చేశారని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం పెదపాడు గ్రామంలోని మద్యం దుకాణం వద్ద కూటమి ప్రభుత్వం ప్రారంభించిన ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌పై గురువారం సాయంత్రం మద్యం వినియోగదారులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం విధానంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా ఎక్సైజ్ శాఖ చర్యలు చేపడుతుందన్నారు. ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా కల్తీ మద్యానికి చెక్ పెట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. యాప్ ద్వారా మద్యం వినియోగదారులకు అరచేతిలోనే సమాచారం అందుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కుట్రపూరితంగా కల్తీ మద్యం ఫార్ములాను తాడేపల్లి ప్యాలెస్ లో తయారు చేశారని విమర్శించారు. వైసిపి హయాంలో సరఫరా చేసిన బ్రాండ్లలో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు చెన్నై, బెంగళూరు, అమెరికా ల్యాబ్‌లు స్పష్టం చేశాయన్నారు. కల్తీ మద్యంలోని వాస్తవాలను బయటకు తీసేందుకు నలుగురు ఐపిఎస్‌లతో సిట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కల్తీ మద్యం గుర్తించేందుకు ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఏలూరు సంఘటనలకు సంబంధించిన మద్యాన్ని (రాయల్ లేన్సర్ విస్కీ) ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్ ల్యాబ్‌కు పంపగా కల్తీ మద్యం కాదని ల్యాబ్ నిర్ధారించిందని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరులో నూతన పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి మద్యాన్ని పరీక్షించి కల్తీని నివారించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ మస్తానయ్య

మోహన్‌రావు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

మోహన్‌రావుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ వి.మదన్‌మోహన్ రచించిన జీనోమిక్ సీక్వెన్సింగ్ - బయో ఇన్ఫర్మేటిక్స్ పుస్తకాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సీనియర్ అధ్యాపకులుగా పనిచేస్తూ, విద్యార్థుల సౌకర్యార్థం ఆధునిక సమాచారాన్ని పుస్తకరూపంలో ప్రచురించడం అభినందనీయమని, ఇలాంటివి చదవడం ద్వారా సరికొత్త విషయాలు నేర్చుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం, విద్యార్థులు, అధ్యాపకులు మదన్‌మోహన్‌కు అభినందనలు తెలిపారు.

2న నార్వేకు ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

లింగ సమానత్వం, మహిళా సాధికారతపై ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో నార్వే ప్రభుత్వ సహకారంతో ఆ దేశ రాజధాని ఓస్లోలో వచ్చే నెల రెండో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగే సదస్సు, నార్వే ప్రభుత్వం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హాజరవుతున్నారు. ఈ సదస్సుకు ఆహ్వానిస్తూ గత నెల 24వ తేదీన ఎంపీకి ఆహ్వానం అందింది. భారతదేశం తరపున ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా ఏడుగురు ఎంపీల బృందాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. తాజాగా నార్వే పర్యటనకు అధికారికంగా అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం నుంచి ఏలూరు ఎంపీకి బుధవారం లేఖ అందింది. నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా జరిగే ఈ పర్యటనలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సహా భారత ప్రతినిధి బృందం వారం రోజులపాటు నార్వేలోని ఓస్లో, ట్రోంసో నగరాల్లో పర్యటించనుంది.

కోటి సంతకాల సేకరణలో మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

కోటి సంతకాల సేకరణతో ప్రజా ఉద్యమానికి శ్రీకారం

పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కోటి సంతకాల సేకరణతో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని పి.రాజవరం, రామన్నపాలెం గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలువురితో సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఎ బాలరాజు మాట్లాడుతూ ప్రజల నుంచి కోటి సంతకాలు సేకరించిన అనంతరం కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకొచ్చాక మోసగించిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు సందా ప్రసాద్, జిల్లా నాయకులు బోధా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, మాజీ సర్పంచి కోర్స వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు రాముడు, ఏసుబాబు, సాయి, సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ ఏరియాలో విద్యార్థినులు

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని బాలికల హైస్కూల్ ప్లస్‌లో 9, 10 తరగతుల విద్యార్థినులు గురువారం స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలో ట్రైనింగ్‌కు వెళ్లారు. కంప్యూటర్ నిపుణుల ద్వారా అనేక అంశాలు, బ్యూటీషన్, హెల్త్ టిప్స్‌లపై అవగాహన పెంపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ జిల్లా కోఆర్డినేటర్ శివారెడ్డి, ట్రైనర్స్ రంజిత, సల్మా, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సుధారాణి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

బంగారు, వెండి వస్తువులు స్వాధీనం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

బస్సు ఎక్కుతున్న మహిళ వద్ద బంగారు, వెండి వస్తువులు ఉన్న పర్సును చోరీ చేసిన కేసులో ఇద్దరు నిందితులను ద్వారకాతిరుమల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోర సొత్తు బంగారు వస్తువులు 33.5 గ్రాములు, వెండి వస్తువులు 127 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. ద్వారకాతిరుమల ఎస్ఐ టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 28వ తేదీన విశాఖపట్నం జిల్లా భీమిలి మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన గొడుగు సత్యవాణి అనే మహిళ తన ఎనిమిదేళ్ల కుమారుడితో కలిసి రాళ్లగుంట తన బంధువుల ఇంటికి ఒక శుభ కార్యానికి హాజరై తిరిగి తాళ్లవలస బయలుదేరింది. ద్వారకాతిరుమల బస్టాండులో బస్సు ఎక్కే క్రమంలో తన బ్యాగులోని బంగారు, వెండి నగలు కలిగిన పర్సును ఎవరో దొంగిలించినట్లు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు సిఐ యుజె.విల్సన్ పర్యవేక్షణలో ద్వారకాతిరుమల ఎస్ఐ టి.సుధీర్ వారి సిబ్బందితో కలిసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ కేసులో నెల్లూరు జిల్లా గొలగమూడి గ్రామానికి చెందిన నిందితులు వేములపల్లి దుర్గ, శివకుమార్‌లను ద్వారకాతిరుమల ఆర్‌టిసి బస్టాండు వద్ద గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు వస్తువులు 33.5 గ్రాములు, వెండి వస్తువులు 127 గ్రాములు చోరీ సొత్తును రికవరీ చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కొయ్యలగూడెంలో నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రకాశం డిగ్రీ కాలేజీలో ఈ నెల 24వ తేదీన పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాబ్‌మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలి : ఎంపిడిఒ

టి.నరసాపురం : కొయ్యలగూడెంలోని ప్రకాశం డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని ఎంపిడిఒ జి.మణికుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు సహకారంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన కోసం శుక్రవారం జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. నిరుద్యోగ, యువత సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆమె సూచించారు.

నోటీసు

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీ పొన్నం ప్రవీణ్ , సర్వే నెంబరు 91-2,90-2A1,90-2B1 లో విస్తీర్ణం 1.798 హెక్టార్లలో , చెబ్రోలు రెవెన్యూ గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా , ఆంధ్రప్రదేశ్ పర్యావరణ అనుమతులు యొక్క ఆర్డర్ నెం. SEIAA/AP/ELR/MIN/09/2023/5214/272.01 & 272. 01, Date : 11.10.2025 గ్రావెల్ మరియు సామాన్య మట్టి (ఆర్డనరీ ఎర్త్) తవ్వకం కోసం SEIAA ఆంధ్రప్రదేశ్ నుండి పర్యావరణ అనుమతులు పొంది యున్నారు. ఆప్రతులు పరివేష్‌పోర్టల్ పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ MoEF & CC వెబ్‌సైట్ నందు లభించును

ఇట్లు
శ్రీ పొన్నం ప్రవీణ్

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, భీమవరం, పెదపేట, ఒన్ టౌన్‌కు చెందిన కుచ్చెనపల్లి రమేష్ S/o. పోతురాజు అను నేను భీమవరంలోని జిరాక్స్ సెంటర్ నుంచి బైక్ మీద వస్తుండగా పాస్‌పోర్టు నెం.S-1601279 పడిపోయింది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సుకు ఇవ్వగలరు.

కుచ్చెనపల్లి రమేష్, S/o.పోతురాజు,
డోరునెం.22-4-22/1,
ఒన్‌టౌన్, పెదపేట, భీమవరం.
సెల్: 9949907221

పాస్‌పోర్టు పోయినది

పచ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరం గ్రామ కాపురస్తులైన బొబ్బిలి నరసింహామూర్తి తండ్రి సింహాద్రి అను నేను నా యొక్క పాస్ పోర్ట్ నెంబర్ A1417093 గల్ల పాస్ పోర్ట్ పిప్పర గ్రామంలో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి కేశవరం వెళ్ళే మార్గ మధ్యలో ఒరిజినల్ పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది నెంబర్‌కు తెలియజేయగలరు.

బొబ్బిలి నరసింహామూర్తి, తండ్రి సింహాద్రి
కేశవరం గ్రామం, గణపవరం మండలం,
పశ్చిమగోదావరి జిల్లా.
సెల్ నెంబర్ 8179322883

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No.320/2025

Between:
శ్రీమతి చవాకుల ధనలక్ష్మి ...వాది
And
మారుబోయిన కాశీరావు ...ప్రతివాది

ప్రతివాది : మారుబోయిన కాశీరావు, తండ్రి కాశయ్య, వయస్సు 45 సం॥లు, హిందు, పురుషుడు, డోర్‌నెం.1-67, బొంతువారి వీధి, జూనియర్ కాలేజ్ దగ్గర, వీరవాసరం గ్రామం, వీరవాసరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. BVRM CJ(Jr.D.) Court. సెల్:9177814975.

వాది తరుపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన

పై నంబరు దావాలో వాది పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు ప్రకారము అమలు చేయటమైనది. కావున పై కోర్టు వారి ఎదుట ది.10-11-2025 ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరయ్యి పై దావా గ్రంథంలో మీ సమాధానం తెలియజేయవలెను. లేనియెడల మీపై శ్రీకోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారీ చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా మీకు తెలియజేయటమైనది. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కోటి వెంకట్రామయ్య
భీమవరం అడ్వకేట్, కాళ్ళ.
ది.22-10-2025 సెల్: 9849356865

TADEPALLIGUDEM MUNICIPALITY
"e" Procurement Tender Notice

Roc.No.2422/E1/2023-24, Dated : 22-10-2025

Sl. No.	Name of the work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1	Providing CC roads & drains Works-5	SCSP	87.80	24-10-2025	07-11-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner
Tadepalligudem Municipality.